


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

(గత సంచిక తరువాయి)

## 31

మూడు రాత్రులు మురిపాలకే సరిపోవటంతో ముచ్చట్లకు వ్యవధి దొరకలేదు కొత్త జంట రవి, భారతులకు. అయినా ఇద్దరి మధ్య తెలియని అనుబంధం, అవగాహనా పెనవేసుకు పోయాయి. ఇంటినిండా ఉన్న చుట్టాల వలన కూడా మాట్లాడుకునేందుకు కుదరలేదు వారికి. చుట్టాలంతా ఎవరిదారిన వారు వెళ్ళి పోగానే శారద, హైమవతి కలిసి చిన్నగా రవి వాటాలోకి కావలసిన సామాను ఒక్కొక్కటి చేర్చారు. ఏ గదిలో చేర్చవలసిన సామాను ఆ గదిలోకి చేర్చి, సర్దుకోవటం వారికే వదిలి పెట్టారు. ఒక మంచిరోజు చూసి హైమవతి కొత్త ఇంట్లో పాలు పొంగించింది. ఆ రోజు నించి ఆ వాటా వారి సామ్రాజ్యమని అందరు కలిసి వారిని పట్టాభిషిక్తుల్ని చేసి వదిలేశారు. దాబా మీది రెండో వాటా వారిదయ్యింది. రెండు వాటాలూ, మేడ మీద రెండు వేరువేరు ఇళ్లల్లాగా ఉంటాయి. రెండింటికి మధ్యలో, వెనుక, ముందు ఖాళీ స్థలం ఉంటుంది. దాంతో పక్క వాటా వాళ్ళకు వీళ్లకు సంబంధం లేకుండా ఉంది. రెండు వాటాలకు కిందింటికి రెండువైపుల నించి విడివిడిగా మెట్లు ఉన్నాయి. పార్వతీశం అన్నదమ్ములు ఒకే చోట కలిసి ఉన్నా ఎవరి ఇల్లు వారికే ఉండేలా కట్టించాడు మరి.

వాటా ముందు ఉన్న చిన్నస్థలంలో కింద ఉన్న చెట్లు చాలనట్లు కుండీలలో మొక్కలు పెట్టుకుంది భారతి. వెనుక వరండాలో ఎదురుగా ఉన్న పిట్టగోడ మీద చదరపు చెక్క ఫ్రేమ్ బిగించుకుని దానిమీదకు చక్కని సువాసన నిచ్చే రేరాణి వంటి పూల తీగెలను పాకించుకుంది. వరండా గోడ మీద తమ పెళ్ళి సందర్భంగా తీసిన ఫోటోల లోంచి తను, రవి ఉన్నది ఎంచి మధ్యలో పెట్టింది. చుట్టూరా వివిధ సందర్భాలలో కుటుంబ సభ్యులతో తామిద్దరూ ఉన్న ఫోటోలు, చిన్న నాటి నించి ఈనాటి వరకు ఉన్నవి తగిలించింది. ఇవన్నీ గోడకు ఒక సగంలోనే.

"మరి ఈ సగం ఖాళీ ఉంచావెందుకు" అని అడిగిన రవి ప్రశ్నకు కొంటె నవ్వే సమాధాన మయ్యింది.

అక్కడే రెండు కుర్చీలు, ఒక చిన్న గుండ్రని బల్ల వేసింది. రోజూ భార్యాభర్తలు అక్కడ కూర్చుని రాత్రిపూట పడుకునే ముందు చల్లగాలిని, చందమామ అందాలను ఆస్వాదించే ఏర్పాటు చేసుకుంది. పుట్టింట్లో ఉండగా కూడా ఆమె డాబా మీద చల్లగాలిలో చందమామను చూసి పరవశించి పోవటం గుర్తొచ్చింది రవికి.

ముందరి గది అతిథులొస్తే కూర్చునేందుకు వీలుగా ముచ్చటగా సర్దింది. ఒక పక్క గూట్లో పెద్ద రేడియో, దాని కింద అరలో దినపత్రికలు.

కాశీనాథుని నాగేశ్వరరావు గారి చేత మొదలు పెట్ట బడిన ఆంధ్ర పత్రిక అందులో చోటు చేసుకుంది. తను పుట్టిన మరు సంవత్సరమే నాగేశ్వరరావుగారు రోజుకి 800 ప్రతులను ఉచితంగా గ్రంథాలయాలకు పంపిణీ చేయించేవారని విని ఆయన పట్ల అనంత గౌరవం పెంచుకుంది భారతి. పైగా ఆ వార్తా పత్రికలో ఎంతో స్పష్టమైన ఛాయాచిత్రాలు ఉండేవి. అదేవిధంగా గోయెంకా గారు తెలుగులో తన చిన్నప్పుడు మొదలు పెట్టిన ఆంధ్ర ప్రభ కూడా ఆమె చదివేది. ఇక ప్లీడరీ చదివే రవి ఆంగ్ల భాష పరిజ్ఞానం కోసం ది హిందూ పత్రిక తప్పనిసరిగా తెప్పించేవారు. రవి బలవంతం మీద భారతి తాను కూడా హిందూని కూడబలుక్కుని చదవటం మొదలుపెట్టి క్షుణ్ణంగా చదవటం నేర్చుకుంది.

ఆ గది గోడలకి తాను స్వయంగా చేసిన కళా రూపాలు ఫ్రేమ్ కట్టించినవి పెట్టింది. ఓ మూల చిన్న మేజాబల్ల మీద చిన్న గాజు కూజాలో ఆరోజు పూసిన తాజా పూలను, ఆకులను ఎంతో కళాత్మకంగా గుత్తులుగా అమర్చిపెడుతుంది.

ఇక పడకగదిలో పెద్ద పందిరిమంచం, చెక్క బీరువా. చదువుకునేందుకు వీలుగా రవి పడుకునే వైపు బల్లమీద పెట్టుకునే చిన్న లైట్. రవి పట్టుబట్టి ఆ దీపం ఏర్పాటు భారతి వైపు కూడా చేయించి ఆమెకు పడుకునే ముందు రోజూ ఒక పావుగంటైనా చదివే అలవాటు చేసాడు. భారతి మంచి వక్త. రవి సాన పట్టడంతో ఆమె ఆంగ్లంలో కానీ, తెలుగులో కానీ మాట్లాడుతుంటే వినసొంపుగా ఉండి ఎవరైనా సరే చెవులొగ్గి వినేవారు. ఏ విషయమైనా పూర్వాపరాలు తెలుసుకుంటే కానీ మాట్లాడేది కాదు భారతి. ఒక విషయం భారతి చెప్పిందంటే అది మళ్ళీ నిజమా, కాదా అని చూసుకునే పని ఉండేది కాదు.

భారతి బీరువాలో దాపుడు చీరెలు, రోజు కట్టేవి విడివిడిగా పొందికగా ఒక అరలో సర్దింది. రవి బట్టలు ఎప్పటికప్పుడు ఉతికి ఇస్త్రీ చేయించి ఒక అరలో పెడుతుంది. తాళం వేసుకునే వీలు ఉన్న అరలో వెండి సామాను, నగలు, నగదు వంటివి భద్రం గా పెట్టుకుంది.

ఇక వంటగదిలో ఒక చిన్న గట్టు కట్టించుకుని దాని మీద పొయ్యి పెట్టుకుంది. కావలసిన సామానంతా చేతికందేలా గూళ్ళల్లో సర్దుకుంది. వంటింటి అలమారకు ఇనుప జాలీ వేయించుకుని అందులో పాలు, పెరుగు వంటివి పెట్టుకుంది. కింద రెండు అరలలో ఊరగాయ జాడీలు అమర్చుకుంది. రోలు ఒక మూలగా వచ్చి కూర్చుంది. తిరగలి పొందిగ్గా కొలువు తీరింది. దేవునికి సరైన స్థలంలో ఒక గూడు అమిరింది.

ఇంటికి ఉన్న రెండో పడక గది ప్రస్తుతం రవి చదువుకునే గది అయ్యింది. కాలేజీ నుంచి వచ్చాక కనీసం ఒక రెండు గంటలు చదువుకుంటాడు రవి. రావటంతోనే దొడ్లోకి వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కుని, బట్టలు మార్చుకుంటాడు రవి. ఆ పాటికి భారతి అతనికోసం వేడి వేడిగా పాలు కాచి, తినటానికి ఏదో ఒకటి సిద్ధం చేసి ఉంచుతుంది. ఇద్దరూ కాసేపు ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకున్నాక రవి తన గదిలోకి వెళ్ళి చదువుకునేందుకు కూర్చుంటాడు. భారతి కిందకి వెళ్తుంది. రవి చదువు పూర్తి చేసుకుని కిందకి వస్తాడు రోజూ. కాసేపు అందరితో గడిపి ఆ పైన వారి గూటికి వారు

చేరతారు. ఇది వారి రోజువారీ కార్యక్రమం. రవి చదువు ఆఖరి సంవత్సరంలో ఉండటంతో చాలా శ్రద్ధగా చదువుకుంటాడు అతను.

భారతి కూడా అతనిని ఆ సమయంలో పలుకరించదు. ఆ సమయం ఎంతో విలువైనదిగా, అతని చదువు చాలా ముఖ్యమైనదిగా ఒక క్రమ పద్ధతి అలవాటు అయ్యేందుకు సహకరించింది భారతి.

"వివాహేయా విద్యానాశాయ, శోభనం సర్వనాశాయ అన్నారు పెద్దలు. ఇంక వాడి చదువేం సాగుతుంది? తప్పుతూ, తారుతూ అయినా ఆ ప్లీడరీ పూర్తి చేస్తే అన్నయ్య ద్వారా ఏదో ఒక నౌకరీ కి ప్రయత్నించవచ్చు." అన్నది శారదమ్మ వీళ్ళ పెళ్ళి అవగానే ఎవరితోనో మాటవరసకి. రవి భారతి వంక చూశాడు చిలిపిగా. ఆ మాటలు నిజం కాకూడదని భారతి ఆరోజే తల అడ్డంగా తిప్పి, పెదవి బిగించి బెదిరించింది రవిని కళ్ళతో మరి. ఎలా వదిలేస్తుంది?

రవికి పరీక్షల ముందు సెలవలు వచ్చాయి చదువుకునేందుకు. పగలల్లా ఇంట్లో ఉండి కష్టపడి చదువుతున్నాడు. సాయంకాలం అందరితో కలిసి గడపటమో, భారతితో తన భవిష్యత్ ప్రణాళికల గురించి చర్చించటమే చేస్తుంటాడు.

అలా మాట్లాడేటప్పుడు ఇద్దరి మధ్యలో ఎన్నో విషయాలు వస్తాయి. భారతదేశాన్ని గురించి వారిద్దరూ మాట్లాడుకోవటం చాలా మామూలు.

"మన దేశానికి రాజ్యాంగాన్ని రచించటానికి ఒక కమిటీని వేశారు తెలుసా? "

"పేపర్లో చదివాను మావయ్యా. దానికి ఛైర్మన్ బాబు సాహెబ్ అంబేద్కర్ గారుట కదా!"

"అవును. ప్రపంచం లో అన్ని రాజ్యాంగాలను చదివి, అన్నిట్లోని మంచిని తీసుకుని మన దేశానికి తగినట్లు రాజ్యాంగాన్ని రాస్తున్నారట. దీని కోసం ఆ కమిటీ సభ్యులు అనేక సార్లు సమావేశమయ్యి చర్చలు జరుపుతున్నారు. వచ్చే సంవత్సరానికి పూర్తి అవుతుందేమో!"

"అయితే రాజ్యాంగం రాయాలా మావయ్యా?"

"నువ్వు ఇంట్లో జమా ఖర్చులనే రాస్తావు. ఒక దేశానికి సంబంధించిన నియమ నిబంధనలను పొందుపరిచే రాజ్యాంగం లిఖిత రూపంలో ఉండటం అవసరం కాదా? మన రాజ్యాంగం ప్రపంచంలోనే లిఖిత రాజ్యాంగాలలో పెద్దదిట."

"ఔను మరి, ఇంత పెద్ద ప్రజాస్వామిక దేశానికి పెద్ద రాజ్యాంగం అవసరమే కదా!" ఒప్పుకుంది భారతి.

ఒక్కోసారి వాళ్ళిద్దరి మధ్య ఇలాంటి సంభాషణలు జరుగుతుండగానే రాజేశ్వరి, నాగరాజు వస్తారు. కాసేపు కబుర్లు చెప్పుకుని అందరూ కలిసి కిందకి వెళ్ళి అందరితో కూర్చుంటారు. రాజేశ్వరి వాళ్ళు రాగానే హైమవతి మటుకు ఒకసారి వాళ్ళని మర్యాదకి పలకరించి, ఏదో పనున్నట్లు లోపలికి వెళ్ళి పోతుంది. ఆమెను అనుసరించి శారదమ్మ కూడా. ఇక శయనమ్మగారు, సుశీల, సరళ, మిగిలిన మగపిల్లలు, ఇంట్లో ఉంటే పార్వతీశం గారు మటుకు వాళ్ళతో కలిసి రకరకాల చర్చల్లో, సంభాషణల్లో పాల్గొంటుంటారు.

## 32

రాజేశ్వరి పెళ్ళి అయిపోయి ఇంట్లోంచి వెళ్లిపోవటంతో సుశీల కొంత వరకు ఒంటరి అయ్యింది. రాజు ఉంటే పని చేసుకుంటూ ఇద్దరూ ఏవో వాదోపవాదాలతో పొద్దు పుచ్చేవారు. ఇద్దరి అభిప్రాయాలు కలిసేవి కావు. కానీ ఆ వాదనలలోనే ఆత్మీయత పెరిగేది.

ఆమె పెళ్ళి అయిన పదిరోజుల లోపే భారతి పెళ్ళి కూడా అనుకోని పరిస్థితులలో జరిగి పోవటం ఆమె కూడా గృహిణిగా ఆనందంగా స్థిరపడిపోవటం జరిగిపోయింది. దాంతో సుశీల చిన్ననాటి నేస్తాలకిద్దరికీ ఒకేసారి దూరమై పోయి ఒంటరి అయ్యింది.

అలాగని ఆమె వాళ్లతో పొద్దస్తమానం గడుపుతుందనీ కాదు. ఆమెకు, వారికి వయసులో కూడా చాలా తేడా ఉంది. ఆ మాటకొస్తే ఇంట్లో పిల్లలందరి కంటే పెద్దది సుశీల. అందరు ఆమె సలహాల కోసం చూస్తారు. చిన్నవాళ్ళే కాదు పెద్దవాళ్ళు కూడా. ఆఖరికి పార్వతీశం కూడా కొన్ని విషయాలు ఆమెతో చర్చిస్తుంటాడు, ఆమె అభిప్రాయాలను గౌరవిస్తుంటాడు కూడా. ఆమె చదువు ఆమెకి తెచ్చి పెట్టిన స్థాయి అది.

ఇరవై ఏడేళ్ళ సుశీల అప్పటికే చదువు పూర్తి చేసుకుని పీహెచ్డీ చేస్తోంది. అది కూడా పూర్తి కావస్తోంది. ఆమె విద్యా తృష్ణకు అంతులేదు. ఇంటాబయటా మంచి విద్యావంతురాలిగా సుశీలకు గౌరవం హెచ్చు.

శేషు సైన్యంలో చేరటం కూడా సుశీల ఆలోచనా సరళిని ప్రభావితం చేసిందని చెప్పక తప్పదు. అందరిలోకి చిన్నవాడైన శేషు తనకేం కావాలో ఖచ్చితంగా నిర్ణయించుకుని తన మాట చెల్లించుకున్నాడు. తనెందుకు మరి సంశయ డోలికల్లో ఊగుతోంది? ఇక తన భవిష్యత్తు గురించి నిర్ణయించుకునే సమయం వచ్చింది అనుకుంది సుశీల.

ఆమె ఆసక్తి వేదాంతం. వేదాంతానికి సంబంధించి ఎన్నో పుస్తకాలు చదివింది ఆమె అవి చదువుతున్న కొద్దీ ఆమెలో జ్ఞానతృష్ణ పెరగ నారంభించింది. తనలోకి తాను అంతర్ముఖి అయి ఆత్మ శోధన మొదలు పెట్టింది. మనిషిలో అసంతృప్తికి మూలకారణం ఏమిటి? బంధాల వలన లభించేది ఏమిటి? శాశ్వత ఆనందం ఎలా లభిస్తుంది? ఇటువంటి

ప్రశ్నలు ఆమెను వేధించటం మొదలు పెట్టాయి. ఇతరులతో బంధాలు పెంచుకోవటం వల్లనే ఇన్నిరకాల అసంతృప్తులు మనని చుట్టుముడుతున్నాయి. ఇవేవీ లేకపోతే ఎంత బాగుంటుంది? ఎటువంటి నిరాశ, దుఃఖం ఉండవు.

సుశీల ఆలోచనలు పయనించే దారి మారింది. తనకు తల్లి, తండ్రి, తోడబుట్టిన వారు ఎవ్వరూ లేరు. మరి ఏ బంధానికి కట్టుబడి వీరందరితో నివసిస్తోంది? శయనమ్మ మొహం సుశీల కళ్ళ ముందు నిలిచింది. మిగిలిన వారందరు రక్త సంబధీకులని ఇటీవలే తెలిసింది. కానీ వారందరినీ మించిన బంధం తనకు శయనమ్మతో ఉంది.

ఎందువలన రాజేశ్వరి వెళ్ళిపోవటం, శేషు సైన్యంలో చేరటం, భారతి పెళ్ళి అయిపోవటం వంటివి తన మనసును కదిలిస్తున్నాయి? ఆమె మనసుకు స్నేహ బంధం వలన అని తోచింది.

ఈ కలతలన్నీ ఉన్నాయి అనుకుంటున్న లేని బంధాల వలననే కదా! సుశీల క్రమంగా ధ్యానం చేయటం నేర్చుకుంది. ధ్యానంలో కాలం గడుపుతున్న కొద్దీ ఆమెకు ప్రశాంతత లభించటం మొదలు పెట్టింది.

మొదట ఒక పావుగంట, అరగంట పాటు ధ్యానంలో కూర్చునే ఆమె రాను, రాను గంటల కొద్ది ధ్యానంలో సమయం గడుపుతోంది. చుట్టూరా జరిగే సంఘటనలేవీ ఆమెను ప్రభావితం చెయ్యలేకపోతున్నాయి. తన రూపం గురించిన శ్రద్ధ రాను రానూ ఆమెలో తగ్గి పోతోంది. ఆఖరికి ఆహారం తీసుకోవాలనే ధ్యాస కూడా పోతోంది. ఇదంతా గత ఆరేడునెలలలో సంభవించిన పరిణామం.

సుశీలలో వచ్చిన ఈ మార్పు ముందుగా గమనించింది శయనమ్మ గారే. ఆమె మొదట రాజేశ్వరి, భారతి పెళ్లిళ్లు చేసుకుని వెళ్ళి పోవటంతో సుశీల ఒంటరితనం అనుభవిస్తుండటం వలన స్తబ్దుగా తయారయిందేమోనని మనసుకు సర్ది చెప్పుకుంది. సుశీలలో వచ్చిన మార్పును శయనమ్మ. తరువాత గమనించింది భారతి. రాను రాను సుశీలకి దేని మీద ఆసక్తి లేకపోవటం, ఎవరితోనూ కలవక పోవటం చూసి కలవర పడింది భారతి. ఒకటి రెండు సార్లు సుశీలను రొక్కించి అడిగింది ఆ మార్పుకు కారణమేమిటని. సుశీల తనలో మార్పు రావటం నిజం కాదని ఖండించలేదు.

"నాకే తెలియట్లేదు భారతీ, దేని మీదా ఆసక్తి ఉండట్లేదు. నువ్వేమీ అనుకోకు కానీ ఏమిటీ జీవితం అనిపిస్తోంది, మీ అందరి నించి దూరంగా వెళ్లిపోవాలని ఉంది. స్పష్టత లేని ఏదో సత్యం గురించి అన్వేషించా లనిపిస్తోంది. ఈ గాలి, ఈ ఎండా, ఈ చలి వీటన్నిటినీ సృష్టించిన ఆ అనంత శక్తి ఏదో తెలుసుకోవా లనిపిస్తోంది. ఆ మహాశక్తి అన్వేషణలో జీవితాన్ని గడిపేయాలని ఉంది. అశాశ్వతమైన ఈ మనుషుల కోసం శాశ్వతమైన ప్రకృతిని సృష్టించిన ఆ మహాశక్తికి కైమోడ్పు లర్పించాలనిపిస్తుంది. నాకు ఆఖరికి నా కన్న తల్లిదండ్రుల మొహాలనైనా తెలుసుకోవాలని అందుకే అనిపించలేదు. ఈ భూప్రపంచం మీదే లేని వారి రూపాలను చూసి నేను చెయ్యగలిగిందేముంది? అంతకన్నా అనంత

బ్రహ్మంలో కలిసిపోయిన వారి ఆత్మశాంతికి ప్రార్థించటమే మంచిది కదా. నా ఆలోచన లేమిటో నాకే అర్థం కావట్లేదు." శూన్యంలోకి చూస్తూ ఇంచుమించు తనతో తనే మాట్లాడుకుంటున్నట్లు అస్పష్టంగా అంది సుశీల.

భారతి ఆమె ఆలోచనల లోతును, తీవ్రతను, నిజాయితీనీ అర్థం చేసుకోగలిగింది. అదే కాదు, సుశీల తీసుకోబోయే నిర్ణయాన్ని కూడా చూచాయగా ఊహించగలిగింది భారతి. వికలమవుతున్న మనసుతో అడిగింది

"నువ్వాలోచిస్తున్న వన్నీ సరే, అమ్మమ్మ పట్ల నీ బాధ్యత మాటేమిటి?" నవ్వింది సుశీల నిండుగా.

“నువ్వడగాల్సిన ప్రశ్నేనా భారతీ, నీకు తెలియని జవాబా?"

"నాకంటే అమ్మమ్మకు నీతో బంధం ఎక్కువ కదా? ‘అందరిల్లు’ మాటేమిటి?”

"అమ్మ పట్ల నా బంధం కంటే ఆ జగన్నాటక సూత్రధారితో బంధం నాకు ఎక్కువ ఆనందాన్నిస్తుంది భారతీ. నువ్వు నన్ను ఈ బంధాల్లో ఇరికించలేవు. ఇవాళ కాకపోతే రేపైనా జరగనున్నది ఆపలేవు. ఈ విషయం అమ్మకి నచ్చచెప్పు. నువ్వుండగా "అందరిల్లు"కు లోటేమిటి? “

ఆరోజు సాయంత్రమే శయనమ్మ భారతిని అడిగింది ఆందోళనగా "తల్లీ భారతీ, సుశీల ఈ మధ్య అదోలా కనిపిస్తోంది. అడిగితే ఏదేదో మాట్లాడుతోంది. నాకు చాలా భయంగా ఉంది. దానితో నువ్వేమన్నా మాట్లాడావా?"

"మాట్లాడాను అమ్మమ్మా. నువ్వు తనని అడిగినా అడగక పోయినా తనే నీతో మాట్లాడుతుంది.”

“ఏమిటమ్మా, తను నాతో మాట్లాడేందుకు ఏముంది ప్రత్యేకంగా?"

"అమ్మమ్మా, ఏమి మాట్లాడినా ఒక్కటి గుర్తుంచుకో. తనని నువ్వు అన్నీ నువ్వే అయి పెంచావు. ఏ లోటు చెయ్యలేదు. నిర్ణయాలు స్వయంగా తీసుకోగల జ్ఞానం ఆమె చదువుకున్న చదువు ఇచ్చింది. సంస్కారం నీ పెంపకం ఇచ్చింది. తను ఏ నిర్ణయం తీసుకున్నా తప్పు చెయ్యదన్నది మనందరికీ తెలుసు. మనకు తను ఏ నిర్ణయం తీసుకున్నా ఒప్పుకోవటం కన్నా వేరే గత్యంతరం లేదు. ఎందుకంటే తన ఆనందమే కదా మన ఆనందం. నీకు చెప్పేంతదాన్ని కాదు కానీ అమ్మమ్మా! ఆధ్యాత్మిక పథాన్ని అనుసరించే వారిని ఆపటం అసాధ్యం "

శయనమ్మకు భారతితో మాట్లాడాక సుశీల గురించిన భయం మరికాస్త ఎక్కువయ్యింది తప్ప తగ్గలేదు.

చివరికి శయనమ్మ భయపడుతున్న ఆ క్షణం రానే వచ్చింది. సుశీల తన ఆలోచనలను శయనమ్మ గారితో పంచుకుంది.

"అమ్మా, నాకీమధ్య ఈ జీవితం ఆనందాన్నివ్వట్లేదు. వేరే ఏదో చేయాలనుంది."

"స్పష్టంగా చెప్పు సుశీలా" అంది శయనమ్మ.,

"అమ్మా, రాజేశ్వరి అంత అనాలోచితంగా పెళ్ళి గురించి నిర్ణయం ఎందుకు తీసుకుంది? తాను చెయ్యని పని తాలూకు పరిణామం భారతి ఎందుకు అనుభవించాల్సి వచ్చింది? కూతుర్లను ప్రాణాధికంగా ప్రేమించిన వాళ్ళ అమ్మకు ఇంత వ్యధ, వ్యాధి ఎందుకు? తల్లిని అమితంగా ప్రేమించిన శేషుకు ఆమె ప్రేమ ఎందుకు లభించలేదు? ఇలాటి అనుమానాలు నన్ను దహించి వేస్తున్నాయి."

“"తల్లీ సుశీలా, ఇవన్నీ పురాకృత కర్మ అనుభవాలమ్మా."

"ఆ కర్మలకు, ఈ ఫలితాలకు సంబంధం తెలుసుకోవాలని ఉందమ్మా. ఇవన్నీ గమనిస్తుంటే కంటికి కనిపించని శక్తేదో మన జీవితాలను శాసిస్తోందని అనిపించటం లేదు? ఆ మాటకొస్తే నీకూ, నాకూ రక్త సంబంధం ఉందా అమ్మా? ఉన్న వాళ్ళకు నేనెవరినో కూడా తెలియదు. వాళ్ళతోనే ఇన్నేళ్ళుగా ఉన్నా నేనెవరినో తెలుసుకునే శక్తి వాళ్లకు లేదు. కానీ అనాథగా మిగిలిపోవలసిన నన్ను ఏ రక్త సంబంధం లేని నువ్వు కడుపున కన్నబిడ్డకంటే మిన్నగా పెంచావు. ఎవరనగలరమ్మా నేను నీ బిడ్డను కానని?" వింటున్న శయనమ్మ కళ్ళు నీటితో నిండిపోయాయి. ఆమెకే అంతుబట్టని భావోద్వేగంతో గుండె బరువెక్కింది.

“నీకు, నాకు ఈ ఋణానుబంధం ఏమిటి? ఇవన్నీ ఆలోచిస్తుంటే మన మందరం కేవలం ఎవరో ఆడిస్తే ఆడే బొమ్మల మనిపిస్తోందమ్మా." సుశీల మొహంలోకి పరిశీలనగా చూసింది శయనమ్మ. ఎంతో అశాంతికి నిలయమైనట్లున్న సుశీల మొహం ఆమె మనసును కలచి వేసింది. ఆమెను చాలా కాలం తరువాత తన హృదయానికి హత్తుకుంది. సుశీల కళ్ళవెంట నీళ్లు కారటం మొదలయ్యింది.

"అమ్మా సుశీలా, నేను నా ప్రవర్తనతో నిన్నేమన్నా బాధ పెట్టానా అమ్మా?" గద్గద కంఠంతో అడిగింది శయనమ్మ.

ఆమె హృదయంలో పసిపాపలా మొహం దాచుకుంది సుశీల

"లేదమ్మా, అదేం లేదు. నాకు నీ చల్లని ఒడిలో దొరికే శాంతి ఇంకెక్కడా దొరకదని ఒక నిమిషం అనిపిస్తుంది. కానీ దీన్ని మించిన శాశ్వతమైన శాంతి కోసం నా మనసు ఆరాటపడుతోందమ్మా. నాకు నలుగురి మధ్యలో నివసించాలని లేదు. ఎంతసేపటికి ధ్యానం చేసుకుందామని, ఒంటరిగా ఉందామని, అందరికీ దూరంగా వెళదామని ఉందమ్మా. దయచేసి నాకు అనుమతి నివ్వు. ఎక్కడికైనావెళ్ళి పోతాను. నువ్వు నిష్కామ యోగివమ్మా. నా మీదున్న ఈ ప్రేమ పాశాన్ని

కూడా తెంచుకుని, దయ చేసి నన్ను అనుమతించు.” సుశీల కన్నీళ్లను ఆపుకోలేక పెద్దగా రోదించింది. విలవిలలాడి పోయింది శయనమ్మ.

"అవేం మాటలమ్మా? నేను ఏవో సేవా కార్యక్రమాలంటూ నిన్ను సరిగ్గా పట్టించుకోలేదేమో. నీకు సరైన వయసులో పెళ్ళి చేసిఉంటే నీవంటూ బంధాలేర్పడి, ఈ నిర్ణయం తీసుకునేదానివి కావేమో? ఆడపిల్లవి ఒంటరిగా ఎక్కడుంటావు?

"నేను ఆడపిల్లగా ఎక్కడా జీవించనమ్మా. మరోమాట నాకు ముందునించి పెళ్లంటే ఆసక్తి లేదమ్మా. నువ్వు చెయ్యక పోవటమే మంచిదయ్యింది. నీ మాట కాదనలేక చేసుకుని బిడ్డలను కనుంటే వారి బాధ్యతా నీకే అప్పగించి వెళ్లాల్సి వచ్చేదేమో !."

"నువ్వేమంటున్నావు సుశీలా?"

"నువ్వు ఒప్పుకో. నేను నా ప్రశ్నలకు సమాధానాలను అన్వేషిస్తూ వెళ్ళిపోతాను."

"మరి నా సంగతి?"

"నామీద ప్రేమ బంధాన్ని తెంచుకోమ్మా. నీ ప్రేమే నన్ను కట్టి పడేస్తోంది. నువ్వు ఒప్పుకుంటే కానీ నేను ప్రశాంతంగా వెళ్ళలేను.”

"నువ్వు లేకపోతే నేనేమై పోవాలే?"

"ఎవరి ఆయుర్దాయమున్నంత వరకు వారు బ్రతకాల్సిందే. నాకు ఈ బంధాలిక వద్దు. నువ్వు ఒప్పుకుంటే ఆనందంగా ఇంట్లో నుంచి వెళ్తాను. నేను సన్యాసం తీసుకోవా లనుకుంటున్నానమ్మా." తన నిశ్చయాన్ని చెప్పింది సుశీల.

ఒక్కసారిగా కళ్ళముందు చీకట్లు కమ్మాయి శయనమ్మకు.

"సుశీలా, ఏమిటి నువ్వనేది? నీ వయసు ఎంతని? అసలు నువ్వేమనుభవించావని అంత పెద్ద ఆలోచన వచ్చింది?"

"ఏమి అనుభవించానని కాదమ్మా. ఏమీ అనుభవించాలని లేదని సన్యాసం గురించి ఆలోచిస్తున్నాను. నాకు శాంతి వైరాగ్యంలోనే లభించేలా ఉంది. నేనేమిటి, నా విలువేమిటి? ఈ అనంత విశ్వంలో నా పాత్ర ఏమిటి? ఈ ప్రశ్నలకు నాకు సమాధానం అన్వేషణలోనే లభిస్తుందమ్మా. "

"నిన్ను అల్లారుముద్దుగా పెంచినందుకు నాకు నువ్విచ్చే బహుమతి ఇదా? సుశీలా నువ్వు లేకుండా నేను బ్రతకగలనా?"

"బ్రతకాలి. బ్రతకగలవు. బ్రతుకుతావు. కావాలంటే పోయేలోగా నిన్ను వచ్చి చూస్తాను. దయచేసి నన్ను వెళ్ళి పోనివ్వు. ఇంత బేలత్వం నీకు శోభనివ్వదమ్మా. నువ్వు నీ జీవితమే ఒక పోరాటంగా బ్రతికినదానివి. భారతి, కర్తవ్య దీక్షాపరురాలు. ఆమె చేతిలో "అందరిల్లు" ఈ నాడు ఉన్నదానికి పదింతలు విస్తరిస్తుంది. నాకు తెలుసు. నీవల్ల కాదనిపించిన నాడు భారతికి అప్పచెప్పు"

"సరే, రేపు పొద్దున్న బాబుగారితో మాట్లాడి చెప్తా. ఈ లోగా తొందరపడి నిర్ణయించుకోకు" అన్నది శయనమ్మ.

"నువ్వు సరే అన్న రెండక్షరాలు అన్నప్పుడే నిర్ణయం జరిగిపోయిందమ్మా. నువ్వే జీర్ణించుకోవాలి. బాబు గారికి చెప్పు "అక్కడ నించి కదిలింది సుశీల.

"సుశీలా, ఒక్క మూడు రోజులు నాకు సమయమియ్యి తల్లీ, నిన్నాపను." శయనమ్మ దీనంగా వేడుకుంది. సరే నన్నట్లు తల ఊపింది సుశీల.

మూడు రోజుల్లో శయనమ్మ భారతి సహాయంతో సుశీలను వదిలి ఉండటానికి కావలసిన మనోబలాన్ని సమకూర్చుకోవటంలో గడిపితే, సుశీల తన సమయాన్ని రవి, భారతుల సహకారంతో చట్టపరంగా తన పేరు మీద ఉన్న ఆస్తి నంతటినీ 'అందరిల్లు' పేర బదలాయించటం, తనకున్న, ఖరీదైన వస్తువులను, వస్త్రాలను, పంచిపెట్టటం, తన పుస్తకాలను గ్రంథాలయానికి ఇచ్చి వేయటం వంటి పనులు పూర్తి చేసుకుంది. ఆ ఇంట తనను గుర్తు చేసే వస్తువేదీ, ఆఖరికి తన ఫొటో కూడా లేకుండా జాగ్రత్త పడింది. పార్వతీశం ఇస్తున్న సలహాలు, సూచనలను విన్నది. హైమవతి, శారదలు వండి పెట్టినవి తిన్నది. వీలైనంత సేపు శయనమ్మ గారి కుడి చేతిని తన రెండు చేతులతో పట్టుకొని కూర్చుంది ఆవిడకు మనోధైర్య మిస్తున్నట్లు.

ముకుందం, మురారి, కృష్ణ, రవి, ప్రసాద్ లతో స్వతంత్ర భారతంలో రోజు రోజుకు మారుతున్న సామాజిక పరిస్థితుల గురించి ఒకరోజు రాత్రంతా చర్చించింది. వాళ్ళందరినీ భారతి భవిష్యత్తులో ఏం చేసినా ఆమెకు అండగా నిలవాలని కోరింది. ఆఖరి రోజైన మూడవనాడు శయనమ్మతో సహా ఎక్కడికో బయటకు వెళ్ళి వచ్చింది. మొత్తానికి శయనమ్మ మనసును తన నిష్క్రమణను ఆమోదించే స్థితికి తెచ్చింది.

ఆ సాయంత్రం కొట్టునించి ఏడు గంటల ప్రాంతంలో రాజేశ్వరి నాగరాజుతో కలిసి ఇంటికి వచ్చింది. పార్వతీశం ఇంటి నించి మురారి పరిగెత్తుకు వచ్చి చెప్పాడు రాజేశ్వరితో.

"రాజూ, భారతి నిన్ను వెంటనే పిలుచుకు రమ్మంది. మళ్ళీ నేను వచ్చి వెనక్కి దింపుతా" మురారి తీసుకు వచ్చిన రిక్షా ఎక్కి వెళ్ళింది రాజేశ్వరి.

ఆమెకు అక్కడకు వెళ్ళే వరకు సుశీల నిర్ణయం తెలియదు. ఒక్కసారి విస్మయానికి ఆపైన దుఃఖానికి గురయ్యింది రాజేశ్వరి. జరిగిన విషయాలన్నీ తెలుసుకుంది. ఆ విషయంలో ఇక తను మాట్లాడేదేమీ లేదని అర్థమయ్యింది ఆమెకు.

"రాజు, భవిష్యత్తులో ఎన్నో నిర్ణయాలు తీసుకోవలసి వస్తుంది. అలోచించి అడుగులు వెయ్యి. నడక తడబడితే దిద్దుకొని సరైన మార్గాన పయనించు నాగరాజు చెయ్యి గట్టిగా పట్టుకో." సుశీల మోహంలో ఎదో తెలియని తేజస్సు, రాజేశ్వరిని అంగీకారంగా తల ఊపేలా చేసింది.

మా అమ్మని, మీ అమ్మని కూడా మీరు జాగ్రత్తగా చూసుకోవాలి. శారద అక్కయ్యను కూడా. నీ ఇంటిని కోవెల అనుకో. ఒక్క నీ ఇంటినే కాక చుట్టుపక్క ఉన్న సమాజాన్ని మార్చాలని ప్రయత్నించు. నువ్వు కొత్తగా అలవాటు చేసుకున్న ఓర్పును వదిలెయ్యకు. మనకి చేతనైనంత చేస్తూ పోతే కనీసం మన ఊరైనా బాగు పడుతుంది. పార్వతీశం గారి కుటుంబం ఊరికి ఏమి చేయగలరో చేసి చూపించు."

ఈ సంభాషణ తరువాత సుశీల రాజేశ్వరితో, భారతితో సరదాగా కాలం గడిపింది. మూడవరోజు రాత్రి తెల్లవార్లూ కలత నిదురతోనే ఉన్న శయనమ్మకు తెల్లవారుఝామున కునుకు పట్టింది. ఏదో జ్యోతి కాంతులు వెదజల్లుతు, అనంత విశ్వంలోకి వెళ్ళి పోతున్నట్లున్నట్లు కనిపించి మెలకువ వచ్చింది. వెంటనే లేచి

"తల్లీ, సుశీలా "అని పిలిచేసరికి భారతి పలికింది.

"అమ్మమ్మా ఏం కావాలీ" అని. సుశీల లేదు. వెళ్ళి పోయింది.

★★★★★

సుశీల వెళ్ళిపోయిన తరువాత శయనమ్మ ఏమైపోతుందోనని అందరూ భయపడ్డారు. అయితే శయనమ్మ తట్టుకుంది. తుఫాను వచ్చిన వేళ వరిగిన మహావృక్షంలా అయ్యిందే తప్ప, నేల వాలి పోలేదు. అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తూ మర్నాటినించీ తన దైనందిన కార్యక్రమాల్లో మునిగిపోయింది. '"అందరిల్లు" అభివృద్ధి చేయటానికి తన పూర్తి సమయాన్ని వెచ్చించటం మొదలుపెట్టింది. శయనమ్మకు "అందరిల్లు" పనులలో భారతి అండదండగా నిలిచింది. స్వాతంత్ర్యం వచ్చాక, రాజేశ్వరి, భారతుల పెళ్ళి సందళ్ళతో జోరు తగ్గిన సేవా కార్యక్రమాలు మళ్ళీ ఊపందుకో సాగాయి

★★★★★

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS